భూమి సమస్యను మరోసారి బలంగా ముందుకు తెచ్చిన 'నారాయణపట్నా' ఆదివాసీ రైతాంగపోరు!

బి.డి.దమయంతి

2009, నవంబర్ 20కి ముందు 'నారాయణపట్నా' చాలా మందికి తెలియక పోవచ్చు, కనీసం ఆ పేరు కూడా చాలా మంది విని వుండకపోవచ్చు. ఎందుకంటే అందరికీ తెలియడానికి అది పెద్ద నగరం కాదు, పెద్ద పట్టణం కూడా కాదు. ఒక బ్లాక్ కేంద్రం మాత్రమే. అది కూడా సమాజం అంతగా పట్టించుకోని ఆదివాసీ ప్రజలు అత్యధికంగా నివసించే ప్రాంతం. (సమాజం అంతగా పట్టించుకోని ఆదివాసీ ప్రాంతాలను మల్టీ నేషనల్ కంపెనీలు ఎక్కువగా 'పట్టించుకోవడం' వల్లనే చరిత్ర మరింతగా కల్లోలభరితమవుతోంది.)

నవంబర్ 20న జరిగిన విచక్షణా రహిత పోలీసు కాల్పులూ, గాల్లో కల్సిపోయిన రెండు నిండు ప్రాణాలూ 'నారాయణపట్నా'ను దేశ ప్రజలందరికీ పరిచయం చేశాయి.

రెండు ప్రాణాలు పోవడం వల్ల అక్కడ జరుగుతున్న హింస వెలుగులోకి వచ్చింది గానీ నిజానికి ఆ కాల్పులు జరగడానికి కొన్ని నెలల ముందు నుండి నేటి వరకూ నారాయణపట్నా ప్రాంతమంతా ఇనుపబూట్ల కింద నలిగిపోతున్నది. ప్రస్తుతం ఒక్క నారాయణపట్నా పట్టణంలోనే రెండు బెటాలియన్ల (మూడు వేల) బి.ఎస్.ఎఫ్., సి.ఆర్.పి.ఎఫ్., తదితర బలగాలు మోహరించి వున్నాయి. మొత్తం దక్షిణ ఒడిషాలో అయిదు బెటాలియన్ల బలగాలు వున్నాయి.

సరిహద్దుల్లోనో, శత్రు సైనికులతో పోరాడుతూనో ఉండవల్సిన అర్ధసైనిక బలగాలు ఈ ఆదివాసీ ప్రాంతంలో ఎందుకు మోహరించి వున్నాయి?

ఇటీవలి కాలంలో మెజారిటీ ఆదివాసీ ప్రాంతాలు పోలీసు, అర్ధసైనిక బలగాల పదఘట్టనల కింద నలిగిపోతుండడం మనం చూస్తున్నాం, కనీసం వింటున్నాం. ఇలా నలిగిపోతుండడానికి పలుకారణాలు పైకి కనబడుతుండవచ్చు. కానీ సారం మాత్రం ఒక్కటే – ఆ ప్రాంత ప్రజల అస్తిత్వాన్ని పాలకవర్గాలు సహించలేక పోవడమే. అయితే పాలకవర్గాలు చెప్పే కారణం మాత్రం, ముఖ్యంగా ఇటీవలి కాలంలో ఏ పోరాటాన్ని అణచడానికైనా అది సమర్థించుకుంటున్న సాకు మాత్రం – ఆ ప్రాంతాలలో మావోయిస్టులు వున్నారనేది. ఆ సాకుతోనైతే ఎంత హింసనైనా ప్రయోగించ వచ్చు. ఎన్ని హత్యలనైనా చేయవచ్చు. ఎంత నెత్తుటినైనా పారించవచ్చు. ఎందుకంటే 'దేశ అంతర్గత భద్రతకు పెను ప్రమాదం' కదా వాళ్లు.

నిజానికి 'నారాయణపట్నా' ప్రపంచానికి పరిచయం కావాల్సింది పోలీసు కాల్పుల వల్లనో, పోయిన రెండు ప్రాణాల వల్లనో కాదు. అక్కడ జరుగుతున్న ఒక బతుకుపోరు కారణంగా అది ప్రపంచానికి పరిచయం కావాల్సి వుండె. కానీ పోరాటాలను పాలకవర్గాలు అణిచివేసినట్టుగానే, పాలకవర్గాలకు పాదసేవ చేసే ప్రసార మాధ్యమాలు పోరాట వార్తలను తొక్కిపడతాయి. లేకుంటే ఆ వార్తలు మరిన్ని పోరాటాలకు నాంది పలుకుతాయని భయం. అయితే అప్పుడప్పుడు అర్ధ సత్యాలతోనో, వక్రీకరణలతోనో అయినా కొన్ని వార్తలను వెలుగులోకి తీసకురాకతప్పని అనివార్యత వస్తుంది. అటువంటి పరిస్థితుల్లోనే 'నారాయణపట్నా' వెలుగులోకి వచ్చింది.

నక్సల్బరీ ఒరవడిలో ఆంధ్రప్రదేశ్‌లో భూసమస్యను బలంగా ఎజెండా మీదికి తెచ్చినది శ్రీకాకుళ పోరాటం. శ్రీకాకుళ ఆదివాసీ రైతాంగ పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తూ ఆ తరహాలోనే మరోసారి భూసమస్యను బలంగా ముందుకు తెచ్చింది ప్రస్తుత నారాయణపట్నా పోరాటం.

నారాయణపట్నా పోరాటానికి దారితీసిన పరిస్థితులు అర్థం కావాలంటే చరిత్రను కొంతైనా తడుముకోవాల్సి వుంటుంది.

నారాయణపట్నా ఒడిషా రాష్ట్రం, కోరాపుట్ జిల్లాలోని ఒక బ్లాక్. భారత దేశం కంటే ఒడిషా రాష్ట్రం చాలా వెనకబడి వుంది. ఒడిషా కంటే కోరాపుట్ మరింత వెనుక బడి వుంది. ప్రభుత్వ లెక్కల ప్రకారమే భారత దేశంలో 26 శాతం పేదరికం వుంటే, ఒడిషాలో 47 శాతం వుంది. అవిభక్త కోరాపుట్ జిల్లాను –కోరాపుట్, రాయగఢ్, మల్కన్‌గిరి, నవరంగపూర్– నాలుగు జిల్లాలుగా విభజించేనాటికి అక్కడ 84 శాతం పేదరికం వుంది.

ఇంత వెనుకబడిన జిల్లాలో ఒక తహసీల్‌గా వుండిన నారాయణపట్నా ప్రస్తుతం నారాయణపట్నా, బందుగాం బ్లాకులుగా విభజించబడి వుంది. నారాయణపట్నా బ్లాక్‌లో తొమ్మిది పంచాయితీలున్నాయి. ఇక్కడ ప్రధానంగా కుయి తెగకు చెందిన ఆదివాసీ ప్రజలు నివసిస్తున్నారు. మొత్తం బ్లాక్‌లో 35 వేలకు పైగా జనాభా వుంటే కుయి ప్రజలు 30 వేలకు పైగా వున్నారు.

ఇది ఎత్తైన కొండల ప్రాంతమే అయినప్పటికీ సాపేక్షికంగా అడవి తక్కువగానే వుంది. కనుక అటవీ ఉత్పత్తుల నుండి వచ్చే ఆదాయమూ తక్కువే. ప్రధానంగా వ్యవసాయం మీదనే ఆధారపడవల్సిన పరిస్థితి. కాబట్టి ఇక్కడి ప్రజలు ఎంతో చెమటను ధారపోసి, కొండలను సైతం తవ్వి, వ్యవసాయ భూముల్ని తయారుచేసుకున్నారు. రాజుల కాలంలోనే వీటికి పట్టాలను కూడా పొందారు. అయితే ఆ భూములు క్రమంగా వాళ్ల చేజారినయి.

నాటి శ్రీకాకుళ పోరాటంలో భూస్వాములు, షావుకార్లూ జిల్లాను వదిలి పారిపోయిన చరిత్ర మనకు తెల్సు. అలా పారిపోయిన దోపిడీ వర్గాల్లో ఎక్కువ శాతం పక్కనే వున్న కోరాపుట్ జిల్లాలో స్థిరపడ్డారు. నారాయణపట్నా ప్రాంతంలోనూ స్థిరపడ్డారు. వీరిలో షావుకార్లు, సుండీలు, బ్రాహ్మణులు, దుంబాలు వున్నారు. క్రమంగా వీళ్లు రకరకాల పద్ధతుల్లో ఆదివాసీల సాగుభూములను కబ్జా చేయడం మొదలు పెట్టారు. ఇట్లా కబ్జా చేసుకున్న వారిలో షావుకార్లతో పాటు సుండీలు ముఖ్యులు.జనాభారీత్యా కూడా వీళ్లు ముఖ్యులు. దుంబాలను వీళ్లందరితో ఒకే గాటన కట్టలేం, స్వతహాగా వీళ్లు దోపిడీ వర్గం కాకపోయినా ఆదివాసీల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని వీళ్లూ పెత్తందారులుగా మారిపోయారు. అయితే ఈ నాలుగు కులాల వారిలోనూ పేదలు కూడా ఉన్నారు.

వీళ్లలో చాలా మంది సారా వ్యాపారులుగా అవతారమెత్తారు. ఈ ప్రాంతమంతా పెద్ద పెద్ద సారాబట్టీలను ఏర్పాటు చేసి విపరీతంగా సారా తయారుచేసి ఆదివాసీలను సారా వ్యసనపరులుగా మార్చారు. సారా తాగిన బాకీ కింద ఆదివాసీల భూములను గుంజుకుంటారు. ఒకటీ అరా ఎకరాల భూమిని కొని చుట్టుపక్కల భూములన్నింటిని దురాక్రమించుకుంటారు. కాలువల కింద వున్న ఆదివాసీల భూములకు నీళ్లు ఇవ్వకుండా అడ్డుకుని, అలా నీళ్లు అందకుండా రెండేళ్లు సాగు చేసుకోలేకపోతే ఇక ఆ సాకుతో ఆ భూములను గుంజుకుంటారు. ఇక్కడ ఈ దోపిడీ వర్గాలు దుకాణాలు పెట్టి వాటి ద్వారా కూడా ప్రజలను దోచుకుంటారు. దుకాణాల్లో సరుకులను బాకీ కింద ఇచ్చి దొంగ లెక్కలతో మోసం చేసి ఆ బాకీ కింద కూడా భూములను గుంజుకుంటారు. అంతేకాదు వీళ్లు ఇక్కడి సంస్కృతిని కూడా మార్చేశారు. పెళ్లిళ్లూ, పండుగలకు బాజా భజంత్రీలు, రికార్డ్ డ్యాన్సులు వంటివి అలవాటు చేసి ఖర్చులను పెంచారు. ఈ ఖర్చుల కింద భూములను కోల్పోయిన వాళ్లు ఎందరో. ఇలా రకరకాల సాకులతోనే కాదు ఏ సాకూ లేకుండానే దౌర్జన్యం చేసి తమకు నచ్చిన భూముల్ని గుంజుకోవడం కూడా సర్వసాధారణమే.

ఆదివాసీల భూములను చట్టబద్ధంగా అనుభవించడానికి, ఆదివాసీ ప్రాంతాలంతటా ఆదివాసేతర భూస్వాములు అనుసరిస్తున్న దొడ్డిదారి వంటి రాచమార్గం ఆదివాసీ మహిళలను ఉత్తుత్తి పెళ్లి చేసుకోవడం. మొరటుగా చెప్పాలంటే 'ఉంచుకోవడం'. ఆ మహిళల పేరుతో పట్టాలు చేయించుకోవడం. ఇలా నారాయణపట్నాలో వున్న కొందరు భూస్వాములకు నాలుగైదు మంది ఆదివాసీ 'భార్యలు' వున్నారంటే తమ ఆస్తులనూ, అధికారాలనూ కాపాడుకోవడానికి పితృస్వామ్యాన్ని ఎంతగా ఉపయోగించుకుంటున్నారో అర్థం చేసుకోవచ్చు. ఇలా ఒక్కొక్కరు వందల ఎకరాల భూములను తమ కబ్జాలోకి తెచ్చుకున్నారు. ఇక్కడ చాలా మందికి బినామీ పట్టాలు వున్నాయి. ఇంకా చాలా భూమిని ఎటువంటి పట్టాలు లేకుండానే ఈ ఆదివాసేతర భూస్వాములు అనుభవిస్తున్నారు.

ఇలా ఆదివాసీలు అన్ని రకాలుగానూ మోసానికీ, దౌర్జన్యానికి గురై తాము చెమడోడ్చి సాగుచేసుకున్న, తమ తల్లిదండ్రుల నుండి వారసత్వంగా వచ్చిన భూములను కోల్పోయి ఆ భూముల్లోనే కూలీలుగా మారారు.

ఆదివాసీల భూములను అమ్మడాన్నీ కొనడాన్నీ నిషేధించే 2/56 చట్టం సాక్షిగా భూములన్నీ ఆదివాసీల చేతిల్నుండి జారి భూస్వాముల కబ్జాలోకి వెళ్లిపోయాయి. (నిజానికి ఇక్కడ అమ్మిందీ కొన్నదీ తక్కువే. మోసమో, దౌర్జన్యమో చేసి గుంజుకున్నదే ఎక్కువ కాబట్టి చట్టం ఉల్లంఘించబడలేదనుకుందామా?)

ఇలా ఆదివాసీల భూములు గుంజుకొన్న ఈ ఆదివాసేతర దోపిడీదార్లు మరెన్నో రకాలుగా వీరిని పీడించుకుతింటున్నారు. ఆదివాసీలను వాళ్ల సొంత భూముల్లోనే కూలీలుగా మార్చిన వీరు కనీసం వారికి కూలీ కూడా ఇవ్వకుండా వెట్టిచాకిరీ చేయించుకొని వాళ్ల బతుకులను మరింత అధ్వాన్నం చేస్తున్నారు. తినడానికి ఒక గొడ్డును ఇచ్చి ఎకరాల కొద్ది భూముల్లో పంటకోయించడం, నూర్పించడం, ధాన్యాన్ని తమ గాదెలకు చేరవేయించడం అన్నీ చేయించుకుంటారు. అలాగే ఒక గొడ్డును ఇస్తే కిలోమీటర్ పరిధిలోని చింతచెట్లన్నీ దులిపి, గింజ తీసి ఇవ్వాలి. ఒక్క పొడపొద్ర గ్రామంలోనే దాదాపు వెయ్యి చింతచెట్లు వున్నాయంటే ఆదివాసీల శ్రమను భూస్వాములు ఎంత దోచుకుంటున్నారో అర్థం చేసుకోవచ్చు.

ఇక్కడితోనే ఈ దోపిడీ ఆగిపోలేదు. లేని పోని సాకులతో ఆదివాసీలపై విపరీతమైన దండుగలు వేస్తారు. రాలిన చింతపండును ఏరుకొని పోతే కూడా దండుగలు వేస్తారు. చేతిలో పట్టుకొని పోతే 50 రూపాయలూ, గోచిలో వేసుకొని వెళ్తే 80 రూపాయలూ దండుగలు కట్టించుకుంటారు. ఈ దండుగల కింద కూడా భూములను గుంజుకుంటారు.

వడ్డీ వ్యాపారంతో కూడా వీళ్లు ప్రజలను దోచుకుంటారు. విపరీతమైన వడ్డీ రేటుతో, చక్రవడ్డీతో ప్రజలను కొల్లగొట్టడం, ఈ అప్పుల కిందికి కూడా భూములను గుంజుకుంటారు. భూములే కాదు ఆదివాసీల సంక్షేమం పేరుతో ప్రభుత్వం చేపట్టే అరాకొరా సంక్షేమ పథకాల నుండి వీళ్లే ప్రయోజనం పొందుతున్నారు. ఆదివాసీల పేరుతో వున్న హాస్టల్ తదితరాలు వీళ్ల పరమే అయ్యాయి. ఈ ఆదివాసేతరుల్లో చాలా మంది కాంట్రాక్టర్లుగా కూడా పనిచేస్తున్నారు. తాము చేయించే కాంట్రాక్టు పనులకు తక్కువ కూలీ ఇవ్వడం ద్వారా కూడా వీళ్లు ప్రజల్ని దోచుకుంటున్నారు. సంతల ద్వారా ఈ ప్రజలపై విపరీతమైన దోపిడీ కొనసాగుతోంది. అక్కడ వీళ్లకు అమ్మబోతే అడవి కొనబోతే కొరివి.

ఇలా దోచుకొని ఆదివాసీలను పీల్చి పిప్పిచేసి వీళ్లు కోట్లకు పడగలెత్తారు. ఇలా నారాయణపట్నాలో వెలిసిన మేడలు వీళ్ల దోపిడీకీ, ఆదివాసీల చితికిన బతుకులకూ నిలువుటద్దాలుగా నిలబడివున్నాయి. విపరీతమైన సంపదలను పోగేసుకున్న వీళ్లు ఇక్కడి బూర్జువా రాజకీయ పార్టీలనూ శాసించే స్థాయికి ఎదిగారు. వీళ్లంతా బి.జె.పి., బి.జె.డి., కాంగ్రెస్‌లల్లో నాయకులుగా చెలామణీ అవుతూ, రాజకీయాధిపత్యంపై తమ పట్టును బిగించారు. అలా తమ దోపిడీకి అడ్డూ అదుపూ లేకుండా చేసుకుంటున్నారు. భూములు ఇవ్వనిరాకరించిన వాళ్లపై భౌతిక దాడులకూ, దౌర్జన్యాలకూ, హత్యలకూ పాల్పడుతున్నారు. వీళ్ల దాడులకు గురయి ఎంతో మంది శాశ్వతంగా అంగవైకల్యానికో, అనారోగ్యానికో గురయ్యారు. మహిళలపై చాలా ఘోరమైన అత్యాచారాలకు పాల్పడిన ఘటనలు ఎన్నెన్నో వున్నాయి. లైంగిక అత్యాచారాన్ని వీళ్లు తమ దోపిడీకి ఒక బలమైన ఆయుధంగానే ఉపయోగించుకుంటున్నారు. ఆదివాసీలను దొంగ కేసుల్లో ఇరికించి పోలీసుస్టేషన్లూ, కోర్టుల చుట్టూ తిప్పడం వంటి వేధింపు చర్యలకు పాల్పడుతుంటారు. ఊరిపందినీ, కోడినీ కోసుకున్నా అడవి జంతువులను వేటాడారని దొంగ కేసులు బనాయిస్తుంటారు.

ఈ ప్రాంత ఆదివాసీ ప్రజలెవ్వరిని కదిలించినా భూస్వాముల, పెత్తందారుల చేతిలో తాము పడిన తీరొక్క కష్టాలను కథలు కథలుగా చెప్తారు. ఈ బాధలను భరించలేకనూ, సర్వం కోల్పోయి అక్కడ బతుకుదెరువు జరగకనూ ఎంతో మంది తమిళనాడు, కేరళ, బెంగుళూరు, విశాఖపట్నం తదితర చోట్లకు వలసలు వెళ్లారు. ఉదాహరణకు పొడపొద్ర గ్రామంలో ఒకప్పుడు దాదాపు 300 కుయి కుటుంబాలు వుంటే, ప్రస్తుతం 70 కుటుంబాలు మాత్రమే వున్నాయి. వీళ్లు కూడా తమ వూళ్లో దౌర్జన్యాలను తట్టుకోలేక పాత గ్రామాన్ని వదిలి ఏటివతల కొత్తగా ఇండ్లు కట్టుకొని వుంటున్నారు. ఈ విధంగా కుయి జనాభా తరిగిపోతూ వుంది.

ఇలా ఈ ఆదివాసీలపై గత అరవైయేళ్లుగా ఈ దోపిడీ, అణచివేత, దౌర్జన్యాలు, అత్యాచారాలు కొనసాగుతున్నాయి. అయితే ఈ ప్రజలు ఎన్నాళ్లని ఇంకా కొనసాగనిస్తూనే వుంటారు? పైగా దేశవ్యాప్తంగా ఆదివాసీలకు అణచివేతకు వ్యతిరేకంగా ఎన్నో తిరుగుబాట్లు చేసిన చరిత్ర వుంది. అందులో భాగంగా ఒడిషాలోనూ కుయి తిరుగుబాట్లు జరిగాయి. కోరాపుట్‌లోనూ లక్ష్మణ్ నాయక్ నాయకత్వంలో జరిగిన బ్రిటీష్ వ్యతిరేక తిరుగుబాటు ప్రసిద్ధి పొందింది. అటువంటి వారసత్వం వాళ్లను ఎల్లకాలం తలవంచుకునే ఎలా వుండనిస్తుంది?

అందుకే తమ భూములకు తాము పరాయివాళ్లుగా, తమ భూముల్లో తామే బానిసలుగా మారిన పరిస్థితి గురించి వాళ్లలో తీవ్రమైన ఆలోచనలు మొదలయ్యాయి. ఒక భూస్వామి దగ్గర జీతగాడుగా పని చేస్తుండిన నాచిక లింగలో కూడా అటువంటి ఆలోచనలు మొదలయ్యాయి. క్రమంగా ప్రజల్లో చైతన్యం రగుల్కొంది. తాము కోల్పోయిన భూములను తిరిగి పొందడం ద్వారానే తమ బానిస బతుకుల నుండి విముక్తి లభిస్తుందని భావించారు. నాచిక లింగ ఒక నాయకుడిగా ముందుకు వచ్చాడు. ఇదే సమయంలో –2004లో– సి.పి.ఐ. (ఎం–ఎల్) కానూ సన్యాల్ గ్రూప్‌కు చెందిన ఛసి ములియా ఆదివాసి సంఘొ (రైతు కూలీ ఆదివాసీ సంఘం) ఈ ప్రాంతానికి విస్తరించింది. నాచిక లింగ తదితరులు ఆ సంఘంలో చేరి పోరాడడం ద్వారా కోల్పోయిన తమ భూములను తిరిగి స్వాధీనం చేసుకోగలమని భావించారు. సంఘంలో చేరి చురుకైన పాత్రను పోషించడం మొదలుపెట్టారు. ఈ క్రమంలోనే సింగన్న అనే మరో నాయకుడు మిలిటెంట్‌గా ముందుకు దూసుకువచ్చాడు. ఫలితంగా తక్కువ కాలంలోనే ఇక్కడ ఛసి ములియా ఆదివాసీ సంఘొ బలపడింది. సంఘ నాయకత్వంలో 2004 జూన్–జులైలో నారాయణపట్నా పంచాయితీలోని బసనాపుట్, డెక్కపార, పొడపొద్ర, బలియపుట్ గ్రామాలలో మొట్టమొదట భూపోరాటాలు ప్రారంభమయ్యాయి. ఈ పోరాట ఫలితంగా 118 ఎకరాల భూమి భూస్వాముల కబ్జా నుండి విముక్తి పొంది తిరిగి ఆదివాసీల సొంతమయింది. అప్పటి దాకా ఆదివాసులను కాల్చుకు తిన్న చిత్రబిడికె, మహంకాళి బిడికె, కొంటొ పొరిడి వంటి ఆదివాసేతర భూస్వాములను గ్రామాల నుండి తరిమేశారు. ఈ పోరాటం సహజంగానే ఇక్కడి పీడిత ప్రజల్లో సంతోషాన్నీ, ఉత్తేజాన్నీ కల్గిస్తే దోపిడీ పాలకవర్గాలకు భయాన్నీ, కలవరాన్నీ కల్గించింది.

నేడు దేశంలోని అన్ని ఆదివాసీ ప్రాంతాలపై బహుళజాతి కంపెనీల దేగకన్ను ఉన్నట్టుగానే ఎన్నో ప్రకృతి సంపదలు, ముఖ్యంగా నాణ్యమైన బాక్సైట్ నిలువలు ఉన్న ఈ ప్రాంతపైనా వాటి కన్ను వుంది. ఇటువంటి ప్రాంతంలో ఏ పోరాటాన్నయినా, చైతన్యాన్నయినా పాలకవర్గాలు ఎలా సహించగలవు?

అందుకే ఆ చైతన్యాన్ని చిదిమెయ్యడానికి ప్రయత్నాలు మొదలుపెట్టారు. 2004 ఫిబ్రవరిలో మావోయిస్టులు కోరాపుట్ ఆయుధాగారంపై దాడి చేశారు. ఈ దాడితో గానీ, మావోయిస్టులతో గానీ ఎటువంటి సంబంధం లేని నాచిక లింగపై ఈ కేసును మోపి 2005లో అరెస్టు చేసి జైల్లో పెట్టారు. నాయకుడిని జైల్లో పెట్టి పోరాటాన్ని ఆపాలనుకున్నారు. కానీ పోరాటం ఆగలేదు. జైల్లో నుండీ, జైలు నుండి విడుదలయ్యా నాచిక లింగ ప్రజలకు మార్గదర్శకత్వం వహిస్తూనే వున్నాడు. పూర్తిగా మిలిటెంట్ పోరాటాలే కాకుండా, న్యాయస్థానాల్లోనూ పోరాడాలనుకున్నారు. భూమిపై తమకున్న హక్కును ధృవీకరించుకోవడానికి కోర్టుల చుట్టూ తిరిగారు. ఒక కేసులో 50 సెంట్ల భూమి కోసం కోర్టుకు పోయి గెలిచారు. అయితే ఈ గెలుపు కోసం వాళ్లు 50 వేల రూపాయలు ధారపోయవల్సి వచ్చింది. ఈ కేసులో స్థానిక జిల్లా కలెక్టర్ ఆదివాసీల పక్షం వహించాడు. అయినప్పటికీ వాళ్లకీ ఖర్చు తప్పలేదు. అయితే కోర్టు లోపలా, కాగితాల్లో ఈ భూమిని వాళ్లు గెలుచుకున్నప్పటికీ, కోర్టు బయటా, ఆచరణలో వాళ్లా భూమిని గెలుచుకోలేక పోయారు. ఈ భూమే కాదు ఇలా ఎన్నో భూముల్ని వాళ్లు కోర్టుల్లో గెలుచుకున్నారు. కానీ భూస్వాముల కబంధ హస్తాల నుండి ఆ భూముల్ని విడిపించి ఏ కోర్టులూ ఆదివాసీలకు స్వాధీనం చేయలేకపోయాయి. ఇలా అనుభవపూర్వకంగా ఈ ప్రజలు కోర్టుల బూటకత్వాన్నీ, నిష్క్రియాపరత్వాన్ని అర్థం చేసుకున్నారు. ఇక అనివార్యంగా మిలిటెంట్ పోరాటం ద్వారానే తమ భూమిని సాధించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇదే సమయంలో ఇదే బ్లాక్‌లోని బొరిగి, నాగులబెడ్డ పంచాయితీలలో మావోయిస్టు పార్టీ నాయకత్వంలో ప్రజలు పెద్ద ఎత్తున కదిలి సారా బట్టీలపై దాడులు చేసి, భూస్వాముల ఆక్రమణలోని 150 ఎకరాల భూమిని ఆదివాసులు తిరిగి స్వాధీనం చేసుకున్నారు. ఈ పోరాటాలు ఛసి ములియా ఆదివాసీ సంఘాన్ని ఉత్తేజపరిచాయి.

ఈ ప్రేరణతో నారాయణపట్నా ఆదివాసీలు 2009 జనవరిలో సారా, బ్రాందీలకు వ్యతిరేకంగా మిలిటెంట్‌గా పోరాటం మొదలుపెట్టారు. సారా ద్వారా తమ భూములను భూస్వాములు ఎట్లా గుంజుకున్నారో వాళ్లకు అనుభవపూర్వకంగా తెల్సు కనుక సారా వ్యాపారం మీదకు, సారా తయారీదారుల మీదకు తమ పోరాటాన్ని ఎక్కుపెట్టారు. మొత్తం బ్లాక్‌వ్యాప్తంగా వున్న ప్రభుత్వ ప్రయివేటు సారా, బ్రాందీ దుకాణాలపై వేలాది మంది ప్రజలు కదిలి దాడి చేశారు. సారా బట్టీలను ధ్వంసం చేశారు. రవాణా చేస్తున్న వాహనాలను ధ్వంసం చేశారు. ఫలితంగా నాటి నుండీ నేటి వరకూ బ్లాక్‌లోని మెజారిటీ గ్రామాల్లో సారా నిషేధం అమలవుతోంది. నిజానికి సారా వ్యతిరేక పోరాటానికి సంబంధించి ఈ సంఘానికి సుదీర్ఘమైన చరిత్రే వుంది. మిగతా జిల్లాల్లోనూ ఈ పోరాటాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్నోసార్లు సంఘ కార్యకర్తలు అరెస్టయి జైళ్లకు కూడా వెళ్లారు. అయితే పోరాటం మిలిటెంట్‌గా కాకుండా కేవలం ప్రదర్శనలు, ధర్నాలు, అర్జీలకే పరిమితమైంది కనుక ఎటువంటి ఫలితాలనూ ఇవ్వలేదు. మిలిటెంట్ రూపాన్ని చేపట్టడంతో మంచి ఫలితాలనిచ్చింది.

నాచిక లింగ తదితరులు చేస్తున్న విప్లవకర ఆలోచనలు ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వానికి మింగుడుపడలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో భూస్వాముల ఆక్రమణలో వున్న భూముల జోలికి వెళ్లకూడదనీ ఫారెస్టు భూముల స్వాధీనానికి మాత్రమే పరిమితం కావాలని ఒత్తిడి తెచ్చింది. కానీ నారాయణపట్నా బ్లాక్ సంఘం రాష్ట్ర నాయకత్వం చేస్తున్న వాదనలతో ఏకీభవించలేదు. 2009 ఏప్రిల్‌లో వచ్చిన ఎన్నికలను బహిష్కరించి ఆదివాసీ రైతాంగాన్ని భూముల స్వాధీనానికి కదిలించాలని నాచిక లింగ తదితరులు ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనలను అంగీకరించడానికి సిద్ధంగా లేని రాష్ట్ర పార్టీ నాచిక లింగ, గణనాథపాత్రో, తపన్ మిశ్రా వంటి నాయకులను బహిష్కరించారు.

పై చర్యతో ఒక రకంగా నారాయణపట్నా పోరాటానికి మితవాద పార్టీ కల్పిస్తున్న అడ్డంకులు తొలిగిపోయాయి. బహిష్కరించబడిన నాచిక లింగను నారాయణపట్నా సంఘమంతా అంటిపెట్టుకొని వుంది. వాళ్లు విడి సంఘంగానే తమ పోరాటాన్ని కొనసాగించదలుచుకున్నారు.

అయితే పోరాటాన్ని ఎలాగైనా అణచాలని కంకణం కట్టుకున్న పాలకవర్గాలు ఈ పోరాటాలను అడ్డుకోవడానికి పూనుకున్నాయి. ఆదివాసేతర భూస్వాములు, వివిధ పార్టీల నాయకులు కల్సి పోలీసుల మద్దతుతో 2009, మే 5న 'శాంతిసేన' పేరుతో సల్వాజుడుం మూకను పోలిన అరాచకపు ప్రయివేటు సేనను ఏర్పాటు చేశారు. ఏర్పడిన రోజునే ఈ సేన నాలుగువేల మందితో నారాయణపట్నాలో ప్రదర్శనను చేసింది. నాచిక లింగ నాయకత్వంలోని ఛసి ములియా ఆదివాసీ సంఘాన్ని నిషేధించాలనీ, సంఘ నాయకులను అరెస్ట్ చేయాలనీ, సంఘం ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకున్న భూములను తిరిగి భూస్వాములకు అప్పజెప్పాలని డిమాండ్ చేసింది. ఆ తర్వాత రోజు నుండి ఈ శాంతిసేన గూండాలు గ్రామాలపై దాడులు చేసి బీభత్సాన్ని సృష్టించడం మొదలుపెట్టారు. సంఘ నాయకుల ఇళ్లను ధ్వంసం చేయడం, కనబడిన ప్రతి ఒక్కరినీ కొట్టడం, హింసించడం, పట్టుకెళ్లిపోవడం, గాల్లోకి కాల్పులు జరపడం, వాళ్లు దాచుకున్న ధాన్యాన్నీ, డబ్బులనూ, కోళ్లనూ, మేకలను ఎత్తుకెళ్లిపోవడం వీళ్ల దినచర్యగా మారిపోయింది. తిండి గింజల్లో ఎండ్రిన్, కిర్సనాయిల్ కలుపడం, అన్నం కుండల్లో పొగాగు నమిలి ఉమ్మడం వంటి ఎన్నో హేయమైన చర్యలకూ ఈ గూండాలు పాల్పడ్డారు. ఈ దాడులన్నింటిలోనూ శాంతిసేనతో పాటు పోలీసులు పాల్గొంటున్నారు.

భూమి పైన తమ హక్కును కాపాడుకోవాలన్నా, తమ అస్తిత్వాన్ని నిలబెట్టుకోవాలన్నా ఈ నిర్బంధాన్ని ప్రతిఘటించడడం తప్ప ఈ

ప్రజలకు మరో మార్గం లేకుండా పోయింది. సాయుధ దాడులను నిరాయుధంగా, శాంతియుతంగా ప్రతిఘటించడం కూడా సాధ్యం కాదని అనుభవపూర్వకంగా తెల్సుకున్నాక ఈ సంఘం ఘెనువా వాహిని అనే మిలీషియా నిర్మాణాన్ని ఏర్పాటు చేసుకుని వున్నది.(ఘెనువా– ఆదివాసీ వీరుడు, మంచి గురికాడు. ఆయన స్ఫూర్తితో ఈ పేరును పెట్టుకున్నారు.) సాంప్రదాయక ఆయుధాలతో ఘెనువా వాహిని సాయుధమైంది. దాదాపు 250 గ్రామాల నుండి వేల సంఖ్యలో ఈ వాహినిలో చేరారు. ఘెనువా వాహిని 'శాంతిసేన'తో వీరోచితంగా తలపడి ఎక్కడికక్కడ దాని దాడులను విఫలం చేసి దానిని తరిమి తరిమి కొట్టింది. ప్రధానంగా ఈ ప్రతిఘటనకు సింగన్న నాయకత్వం అందించాడు.

శాంతిసేనను తరిమి కొట్టిన ఉత్తేజంతో సంఘం జూన్ 12ను భూ ఆక్రమణ దినంగా ప్రకటించింది. ఈ ప్రకారం జూన్ 12న బ్లాక్‌లోని ఏడు పంచాయతీలనుండి దాదాపు 250 గ్రామాలు కదిలి భూస్వాముల కబ్జాలో వున్న 2,500 ఎకరాల భూములను స్వాధీనం చేసుకుని, ఎర్రజెండాలు పాతి నాగళ్లతో దున్నారు. ఇందులో నారాయణపట్నాను ఆనుకుని వున్న కోసరాజు, కుంజపొడి వంటి బడా భూస్వాములకు చెందిన 700 ఎకరాల భూమి కూడా వుంది. ఆ తర్వాత 159 గ్రామాలకు ఈ భూమిని పంచారు. స్వాధీనం చేసుకున్న దాంట్లో అధిక భూమిని వ్యక్తిగతంగా కాకుండా గ్రామాల వారీగా సమిష్టిగా పంచుకున్నారు.

ఈ భూపోరాటం కేవలం భూపోరాటంగానే వుండిపోలేదు. ప్రస్తుతం ఆదివాసీల అస్తిత్వానికి పెను ప్రమాదంగా వున్న మైనింగ్‌కు వ్యతిరేకంగానూ విస్తరించింది. ఇదే జిల్లాలోని పొట్టంగి బ్లాక్‌లోని కొటియా, తురియా, కంటి పంచాయితీలలో వ్యాపించి వున్న పర్వత శ్రేణులను దేవమాలి పర్వత శ్రేణులంటారు. ఇవి సముద్ర మట్టానికి 4,385 అడుగుల ఎత్తున, 17 చదరపు కిలో మీటర్ల వైశాల్యంలో వున్నాయి. ఈ కొండల్లో 3,700 లక్షల టన్నుల బాక్సైట్ నిల్వలున్నట్టు శాస్త్రజ్ఞులు చెప్తున్నారు. ఇప్పటికే ఈ పర్వత శ్రేణులకు సమీపంగా వున్న సిమిలిగూడ బ్లాక్‌లోని పంచమహల్ పర్వత శ్రేణుల్లో నాల్కో ఫ్యాక్టరీ గత 30 సంవత్సరాలుగా బాక్సైట్‌ను తవ్వుతూ దామన్‌జోడికి తరలిస్తున్నది. ఇప్పుడు దేవమాలి పర్వతాలను కూడా నాల్కో లీజుకు తీసుకుంది. బాక్సైట్ వెలికి తీయడానికి అవసరమైన రోడ్లు తదితర ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌నంతా అది తయారు చేసుకుంది. ఇక ఏ రోజైనా తవ్వకాలు మొదలు పెట్టవచ్చు. గ్రామాలను ఖాళీ చేయాల్సిందిగా నోటీసులు జారీ చేశారు. ఇలా జీవన్మరణ సమస్యతో కొట్టుమిట్టాడుతున్న ప్రజలూ, కొన్ని సంఘాలు కల్సి 'దేవ్‌మాలి సురక్షా సమితి'ని ఏర్పాటు చేసుకొని పోరాడుతున్నారు. ఈ పోరాటానికి ఛసి ములియా ఆదివాసీ సంఘం అండగా నిలబడింది. ఈ సంఘం మద్దతుతో 'దేవ్‌మాలి సురక్షా సమితి' 2009 ఏప్రిల్‌లో అన్ని సెక్షన్ల పీడిత ప్రజలను కలుపుకొని 12 వేల మంది ప్రజలతో బహిరంగ సభ జరిపి పోరాటానికి పిలుపునిచ్చింది. ఇలా భూస్వాములకు వ్యతిరేకంగా మొదలైన ఛసి ములియా ఆదివాసీ సంఘ పోరాటం దళారీ నిరంకుశ బూర్జువాలకూ, సామ్రాజ్యవాదులకూ వ్యతిరేకంగా కూడా మారిపోయింది. ఇలా ఈ సంఘం సమస్యలపై ప్రజలను కదిలిస్తూ, సంఘటితం చేస్తూ ఆరు బ్లాకులకు విస్తరించింది.

ప్రభుత్వ వ్యవస్థ పట్ల ఎన్నడో విశ్వాసాన్ని కోల్పోయిన ఇక్కడి ప్రజలు సంఘాన్ని ఒక ప్రత్యామ్నాయ పాలనా వ్యవస్థగా భావిస్తున్నారు. వాళ్ల ప్రతి సమస్య పరిష్కారానికీ సంఘం వైపే చూస్తున్నారు.

అందుకే దోపిడీ శక్తులకు కంటగింపుగా మారింది. ముఖ్యంగా ఈ ప్రాంతపు భూస్వాములూ, లిక్కర్ మాఫియా, మైనింగ్ మాఫియా, రాజ్యం కలిసి ఈ సంఘంపై అది నడుపుతున్న పోరాటాలపై కక్ష కట్టాయి. వాటిని అణచడానికి మరిన్ని పథకాలను పన్నాయి. అందులో భాగంగా నాచిక లింగ, సింగన్న, రాంపొడి (ఇతను కూడా ఒక నాయకుడు)లను అరాచకులుగా పేర్కొంటూ పోస్టర్లు వేశారు. ఎ.పి.లో అడుగుపెడితే పట్టుకుంటామనీ, కాల్చి చంపుతామనీ బెదిరింపు ప్రకటనలు చేశారు. తమ ప్రియతమ నాయకులను అరాచకులుగా చిత్రీకరించడంతో ప్రజలంతా భగ్గున మండారు. అక్టోబర్ నెలలో దాదాపు రెండు వేల మంది నారాయణపట్నా పోలీసు స్టేషన్‌ను చుట్టుముట్టి పోలీసులతో క్షమాపణలు చెప్పించారు. ఇలా మరోసారి సంఘటిత ప్రజా శక్తి ముందు పోలీసులూ, రాజ్యం తలవంచక తప్పలేదు.

ఇలా సంఘటిత చైతన్యంతో ముందుకు సాగుతున్న ప్రజలు తాము పోరాడి సాధించుకున్న భూముల్లో వేసిన పంటను కోసుకోవడానికి సిద్ధమయ్యారు. పోరాటాన్ని దెబ్బతీయడం కోసం శతవిధాల ప్రయత్నం చేస్తున్న పోలీసులు నవంబర్ 19న పథకం ప్రకారం దుంబగూడ గ్రామానికి వెళ్లి మావోయిస్టులకు సహకరిస్తున్నారంటూ ప్రజలను బెదిరించారు. మహిళలతో అసభ్యంగా మాట్లాడారు. సంఘాన్ని దుర్భాషలాడారు. (నల్గురి మహిళలను అత్యాచారం కూడా చేశారు. అయితే ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.) దీన్ని వ్యతిరేకిస్తూ, పోలీసులను నిలదీయాలని నిర్ణయించుకొని నవంబర్ 20న ప్రజలు కదిలి నారాయణపట్నా పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. మొదట దాదాపు 200 మంది చేరుకున్నారు. ఇంకా బారులు బారులుగా ప్రజలు తరలి వస్తూనే వుండినారు. మొదట చేరుకున్న ప్రజలు 'దుంబగూడకు ఎందుకు వచ్చారని ప్రజలతో ఎందుకు దౌర్జన్యంగా ప్రవర్తించారనీ' పోలీసులను ప్రశ్నించడం మొదలు పెట్టారు. కానీ పోలీసులు ఏమీ సమాధానం చెప్పకుండా, అహంకారపూరితంగా స్టేషనుకు తాళం వేసి లోపలికి వెళ్లిపోయారు. దీన్ని సహించలేని

సింగన్న, మరికొందరు ఘెనువా వాహిని కార్యకర్తలు గేట్ దూకి లోపలికి వెళ్లారు. స్టేషన్ ఆఫీసర్ వద్దకు వెళ్లి నిలదీశారు. ఇరుపక్షాల మధ్య వాగ్వివాదం జరుగుతుండగానే పై అంతస్తులోనూ, కిందా వున్నా పోలీసులు ఎటువంటి హెచ్చరికలు చేయకుండా విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో తలకు తూటా తగిలి ఆంద్రు అనే కార్యకర్త అక్కడికక్కడే కన్నుమూశాడు. సింగన్న కూడా గాయపడి పడిపోయాడు. ఆ తర్వాత అతన్ని పోలీసులు గొడ్డలితో పాశవికంగా నరికి చంపారు. ఈ ఘటనలో 20 మందికి పైగా గాయపడి చెల్లాచెదురయ్యారు.

ఈ దారుణ సంఘటనను రాష్ట్రంలోని, దేశంలోని ఎందరో ప్రజస్వామిక వాదులు ముక్తకంఠంతో ఖండించారు. అయితే ప్రజాస్వామ్యం అనే మాటను వల్లెవేయడం తప్ప, దాని అర్థాన్ని ఎన్నడూ వంటపట్టించుకోని ప్రభుత్వం ఏ ప్రజాస్వామిక గొంతుకనూ సహించలేకపోయింది. నిజనిర్ధారణ కోసం వెళ్లిన ప్రజాస్వామిక వాదులను, మహిళా బృందాలను శాంతి సేన అడ్డుకొని దౌర్జన్యాలకు పాల్పడింది. నారాయణపట్నా పట్టణం ఒక నిర్బంధ శిబిరంగా మారిపోయిన వైనాన్ని అక్కడికి వెళ్లిన ప్రజాస్వామికవాదులంతా వెల్లడించారు. ఒక్క నారాయణపట్నా పట్టణంలోనే కాకుండా బందుగాం, లకింపూర్, దామన్‌జోడి వంటి పట్టణాలలో మొత్తం 8 శిబిరాలు వున్నాయి. ఇవన్నీ శాంతిసేనతో నిండి వున్నాయి. అంటే ఊపిరి పీల్చుకోవడానికి కూడా స్వేచ్ఛ లేకుండా ఈ పట్టణాల్లోని సాధారణ జన జీవనం ఎంతగా ప్రభావితం అవుతున్నదో అర్థం చేసుకోవచ్చు.

ఇక ఇప్పటికీ ఈ శాంతిసేన, వాటికి తోడూ నీడా అయిన అర్ధసైనిక బలగాలు కూంబింగ్‌లు, దాడులు చేస్తూ ఈ ప్రాంతమంతటా భీతావహ వాతావరణాన్ని కొనసాగిస్తూనే వున్నారు. కుయి ప్రజల అస్తిత్వ పోరాటానికి నాయకత్వం వహిస్తూ, ప్రజల ప్రేమాభిమానాలను విశేషంగా చూరగొన్న నాచిక లింగను హత్యచేసే లక్ష్యంతో 'ఆపరేషన్ లింగా' పేరుతో ఈ బీభత్సకాండను కొనసాగిస్తున్నారు. ఇలా దాడులు చేస్తూ ప్రజల్ని అరెస్టులు చేస్తున్నారు, చిత్రహింసలకు గురిచేస్తున్నారు, లొంగిపోవాలని వత్తిడి తెస్తున్నారు, సంఘంలో చురుగ్గా పనిచేస్తున్న సంఘనాయకుల ఇళ్లను ధ్వంసం చేస్తున్నారు. ఈ విధంగా కొన్ని గ్రామాలు 15-20 సార్లు దాడులకు గురయ్యాయంటే పరిస్థితి ఎంత భీతావహంగా వుందో అర్థం చేసుకోవచ్చు. నవంబర్ 20 తర్వాత జరిగిన దాడుల్లో ఇప్పటికి 135 మంది అరెస్టయ్యారు. ఇందులో 20-30 శాతం మంది మహిళలున్నారు, పసిపిల్లల తల్లులు కూడా వున్నారు. కుముదిని, గోపాల్ సిరికా వంటి నాయకులు కూడా అరెస్టయిన వారిలో వున్నారు. తొమ్మిది మంది చిన్నపిల్లలు కూడా వున్నారు. ఫిబ్రవరి 14న బలియాపుట్ గ్రామంపై దాడి చేసిన సందర్భంగా పోలీసులు ఒక యువతిపై అత్యాచారానికి కూడా పాల్పడ్డారు. దుంబగూడ గ్రామానికి చెందిన నారీ కూతురు చుట్టపు చూపుగా బలియపుట్‌కు వెళ్లగా అక్కడ ఆమెను నలుగురు పోలీసులు పాశవికంగా అత్యాచారం చేశారు.

ఇలా అరెస్టయి జైళ్లలో వున్న వారి పరిస్థితి కూడా ఘోరంగా వుంది. వుంటుంది కూడా- జైళ్లు సంస్కరణాలయాలు అని రాజ్యం వల్లెవేస్తుంది కానీ వాస్తవానికి అదలా ఎప్పుడూ భావించదుగా. ఫలితంగా 2010 ఏప్రిల్ నెలలో పగ్గం గ్రామానికి చెందిన కొండగొర్రె గంగులు మరణించాడు. ఇతని శవాన్ని ఇంటికి చేర్చడంలో జైలు అధికారులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారు. అలాగే 2010 జూన్ నెలలో మరొకరు మరణించారు.

ఇలా సాధారణ ప్రజలపై, లేదా ఒక చట్టబద్ధమైన ఛసి ములియా ఆదివాసీ సంఘంపై చేస్తున్న ఈ ఫాసిస్ట్ దాడులను మావోయిస్టులపై చేస్తున్న దాడులుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమర్థించుకుంటున్నాయి. ఇలా సమర్థించుకోవడం కోసమే దీన్ని మావోయిస్టుల పోరాటంగా చిత్రీకరిస్తున్నాయి.

నిజానికి ఈ ప్రజలు ఏం కోరుకున్నారు? అన్యాయంగా తమ నుండి గుంజుకున్న తమ భూములు తమకు తిరిగి ఇవ్వాలని కోరుకున్నారు. ఇది న్యాయమైన కోరికే కాదు చట్టబద్ధమైనది కూడా. 2/56 ప్రకారం ఆదివాసీల భూములు అమ్మడం, కొనడం, అన్యాక్రాంతం కావడం చెల్లదు కదా. 'మా భూములు మాకు కావాలి' అని ఈ ప్రజలు అడిగారంటే సారాంశంలో పై చట్టాన్ని అమలుచేయమనే.

రాజ్యం తాను తయారు చేసిన చట్టాన్ని తానే అమలు చేయడానికి ఎందుకు నిరాకరిస్తున్నది? చట్టాన్ని వుల్లంఘించిన వాళ్ల పక్షాన నిలబడి, అమలు చేయమని అడిగిన వారిపై ఎందుకు నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నది?

దీనికి సమాధానం స్పష్టమే! రాజ్యం దోపిడీ వర్గ ప్రయోజనాలకు కట్టుబడి వుంది. అది చట్టాల్ని తయారు చేయడమైనా, అమలు చేయడమైనా, ఆఖరికి ధిక్కరించమైనా దోపిడీ వర్గ ప్రయోజనాల కోసమే చేస్తుంది. ఒక్కోసారి ప్రజాస్వామ్య శక్తుల వత్తిడికి లోబడినట్టు నటించి ప్రజా ప్రయోజనాలకు అనుకూలంగా కొన్ని చట్టాలను అనివార్యంగా చేసినా వాటిని అదెన్నడూ అమలుచేయదు. అమలు చేయమని అడిగినా సహించదు.

ప్రస్తుతం ఈ ప్రజలు తమ భూమి తమకు చెందాలని అడుగుతున్నారు? ఇది సహజమైన కోరిక. కానీ ఈ కోరిక పాలకవర్గాలకు

మింగుడుపడడం కష్టం. ఎందుకంటే దోపిడీ వర్గ పునాదులను కదిలించే శక్తి వున్న కోరిక ఇది. ఈ కోరిక అక్కడ వేళ్లూనుకుపోయిన భూస్వాములకు మింగుడు పడదు. తిష్టవేసుకున్న, తిష్టవేసుకోవాలని ప్రయత్నిస్తున్న బహుళజాతి కంపెనీలకూ మింగుడు పడదు.

కాబట్టి ఈ పోరాటాన్ని అణచివేయడానికే అది ప్రయత్నిస్తుంది. అణచివేతకు సాధికారత కోసం మావోయిస్టు ముద్ర ఒకటి వాళ్ల చేతిలో ఆయుధంగా వుంది, ఎవరి నుదిటిపైనైనా వేయడానికి.

ఇన్నాళ్లూ ఈ పోరాటంలో మావోయిస్టులకు ప్రమేయం వుందో లేదో కానీ, ఆ సమీప ప్రాంతంలో మావోయిస్టు పార్టీ వున్న మాటయితే వాస్తవం. మరి ప్రజలకు ఇంత అన్యాయం జరుగుతుంటే మావోయిస్టు పార్టీ ప్రేక్షక పాత్రకే పరిమితం కాగలదా? ఆ ప్రజలకు అండగా నిలబడడానికి ప్రయత్నించదా? అంతేకాదు ఒక న్యాయమైన చట్టబద్దమైన కోరికను తీర్చుకోవడానికి చట్టబద్ధ మార్గాలన్నీ మూసుకుపోయినప్పుడు ఈ ప్రజల ముందు ఇంకే పోరాటమార్గముంది? శాంతిసేనల దాడినుండి తప్పించుకోవడానికి పిఎల్‌జిఎ–మావోయిస్టు పార్టీ సేన–ను ఆశ్రయిస్తే దానికి బాధ్యత ఎవరిది?

